క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌ను ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓవీ ప్రసాద్ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సోమిరెడ్డి ఒక పెద్ద అవినీతి పరుడు

నెల్లూరు(పొగతోట): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ఒక పెద్ద అవినీతిపరుడని పొదలకూరు మాజీ ఎంపీపీ బిరదవోలు మహేంద్ర సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏపీ జెన్‌కోకు సంబంధించిన ఫ్లైయాష్‌ను బల్కర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నది వాస్తవమా.. కాదా..అని ప్రశ్నించారు. లేఅవుట్ల యాజమాన్యాల నుంచి కోట్లాది రూపాయలను దండుకున్నారని ఆరోపించారు. పరిశ్రమల యాజమాన్యాలను బెదిరిస్తూ ముడుపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపు సంపాదించిన సొమ్ముతో నెల్లూరులో ఇళ్లు కొనుగోలు చేశారన్నారు. సోమిరెడ్డి అవినీతి, అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. తాను వాటాలు దండుకుంటూ ఎదుటి వారిపై బురదజల్లుతూ మానసికక్షోభకు గురిచేస్తున్న నీచుడు సోమిరెడ్డి అన్నారు. సర్వేపల్లిలో ఆయన అవినీతి చిట్టా ఒక్కొక్కటిగా బయట పడుతుందన్నారు. సోమిరెడ్డి బెదిరింపులకు తాము బయపడమన్నారు.

నైపుణ్యతపై అవగాహన పెంచుకోవాలి

నెల్లూరు (టౌన్): విద్యార్థి దశ నుంచే నైపుణ్యతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సింధూర సూచించారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సక్సెస్ ఒడిసి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థుల పురోగతి కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని వెల్లడించారు. 45 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో తమ విద్యాసంస్థలు అనేక విజయాలు సొంతం చేసుకున్నట్లు చెప్పారు. అతి చిన్న వయస్సులోనే స్పెల్‌బీ కాంపిటేషన్‌లో గెలుపొంది నెల్లూరు ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిన ప్రముఖ టీవీ స్టార్ ఆకాష్ వికోటి నుంచి నేటి విద్యార్థులు నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. ఆకాష్ వికోటి మాట్లాడుతూ చదువులో రాణించేందుకు ఐదు ప్రణాళికలు అవసరమన్నారు. పట్టుదల ఉంటే విజయాలు సొంతమవుతాయన్నారు. తాను అధ్యాపకులు, తల్లి,దండ్రులు ప్రోత్సాహంతోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించానని తెలిపారు. అనంతరం ఆకాష్ వికోటిని డా.సింధూరతో పాటు నారాయణ స్కూల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. నారాయణ పాఠశాలల ప్రిన్సిపాల్స్, డీన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు సిటీ: మంత్రి నారా లోకేష్‌ను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అమరావతిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

పోతురాజుకు ప్రత్యేక పూజలు

మనుబోలు : మండలంలోని బండేపల్లి గ్రామంలో పోతురాజు తిరునాళ్లను సోమవారం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్తులు పోతురాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోతురాజును దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గాలి రామకృష్ణారెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, పొన్నూరు రామకృష్ణయ్య, లక్ష్మయ్య, మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.

సీఎంల భేటీపై విమర్శలు తగవు

నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి భేటీపై విమర్శలు తగవని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా కాలం తరువాత తెలుగు రాష్ట్రాల సీఎంలు సమావేశమై రెండు రాష్ట్రాల ప్రయోజనాలపై చర్చించారని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు ఒక అడుగు తగ్గి తెలంగాణ సీఎంతో సమావేశమైతే అభినందించాల్సింది పోయి అవాకులు, చెవాకులు పేలడం సమంజసం కాదన్నారు.

జనహృదయ నేత వైఎస్సార్



ములుమూడిలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గొల్లకందుకూరులో..



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అభివృద్ధి, సంక్షేమ పాలనతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఖలీల్‌అహ్మద్ సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ అందించిన అభివృద్ధి, సంక్షేమ పాలనను స్మరించుకున్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 సేవలు, తదితర పథకాలను అమలు చేసి ఎంతో మందికి ప్రాణదానం చేశారని కొనియాడారు. కార్పొరేటర్లు వేలూరు మహేష్, నీలి రాఘవరావు, షేక్ కరిముల్లా, మొగళ్లపల్లి కామాక్షీదేవి, ఊటుకూరు నాగార్జున, గుంజి జయలక్ష్మి, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, కొణిదల సుధీర్, మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేనీ, నాయకులు, సంక్రాంతి కళ్యాణ్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, మద్దినేని శ్రీధర్, దొంతాల రఘు, షేక్ మహబూబ్‌బాషా, పెళ్లూరు శ్రీనివాసులు, అబ్దుల్ మస్తాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

నెల్లూరు సిటీ: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూరల్ పరిధిలోని డివిజన్లతో పాటు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సంక్షేమాభివృద్ధి పాలనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.

• రూరల్ మండలం పొట్టేపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులకు స్వీట్లు పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, రవీంద్రరెడ్డి, సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, వెంకటరావు, కే సుధాకర్, నాగేంద్ర, కే చిన్నయ్య, రాజేష్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరాభవన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వైఎస్సార్ అందించిన అభివృద్ధి, సంక్షేమ పాలనను స్మరించుకున్నారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు సంజయ్‌కుమార్, గణేష్‌బాబు, మోహన్, శ్రీరాములు, మురళి, రామకృష్ణ, సురేష్, ఫిరోజ్, తదితరులు, పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వైఎస్సార్

నెల్లూర(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో దివంగత సీఎం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి వృద్ధులతో కలిసి ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సమాజంలో ఆదరణలేని వృద్ధులకు సంక్షేమ పథకాలను అమలు చేసి అండగా నిలిచి వారి మదిలో చిరస్మరణీయులగా నిలిచారని కొనియాడారు. అనంతరం వృద్ధులకు మిఠాయిలను పంచారు.



పొట్టేపాళెంలో..



కొత్తవెల్లంటిలో..



సౌత్‌మోపూరులో..



గీతామయి వృద్ధాశ్రమంలో..



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉపాధి పనులు ప్రారంభించాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న రెండు నెలలు వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. కూలీలకు ఎక్కడా పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి పనులు చేపట్టే ప్రదేశంలో సరైన వసతులు కల్పించడం లేదన్నారు. కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.300 వేతనం అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి ముత్యాల నాగయ్య, రైతు సంఘ కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు పొదర్తి మస్తానయ్య, శ్రీపతి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

నెల్లూరు(దర్గామిట్ట): సైదాపురం మండలం కలిచేడులో మైకా మైన్సలో పనిచేసే కార్మికులకు విద్య, వైద్యం, తదితర సౌకర్యాలను కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సర్దార్ షఫీహరూన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఎదుట బైటాయించాడు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కలిచేడులో కోట్లాది రూపాయల మైనింగ్ జరుగుతున్నా కార్మికులకు సౌకర్యాలను కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి వచ్చి కార్మికుల స్థితిగతులను పరిశీలించాలని కలెక్టర్‌ను కోరారు.

వర్షాకాల సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు

• కమిషనర్ వికాస్‌మర్మత్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగర పరిధిలో వర్షాకాలంలో తలెత్తే సమస్యలను అధిగమించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ 4, ఇంజినీరింగ్ 10, టౌన్‌ప్లానింగ్ 6, హౌసింగ్ 8, పబ్లిక్‌హెల్త్ 3, ఆప్కాస్ 1, పెన్షన్ విభాగానికి రెండు చొప్పున మొత్తం 34 ఫిర్యాదులు అందాయని కమిషనర్ వెల్లడించారు. తొలుత గత వారం అందిన అర్జీల పరిష్కారంపై విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో అండర్ బ్రిడ్జిల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో డ్రైనేజీల్లో పూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఫిర్యాదికి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్ఓ వెంకటరమణ, సిటీప్లానర్ దేవీకుమారి, ఎస్ఈ సంపత్‌కుమార్, మేనేజర్ ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కోవూరు : మండలంలోని గంగవరం గ్రామదేవత ప్రక్కేశమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి బంగారు మంగళసూత్రం, వెండి కిరీటం, వెండి ఆభరణాలను దొంగలు అపహరించారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ సోమవారం తెలిపారు.

అల్లీపురం పీహెచ్‌సీ తనిఖీ



నెల్లూరు సిటీ: అల్లీపురంలో పీహెచ్‌సీని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పెద్దచెరుకూరు సచివాలయం పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. వైద్యులు కొల్లి హజరత్‌రెడ్డి, కొడావత్ బలరామ్‌నాయక్ ఉన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



వార్డు సచివాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు భగత్‌సింగ్‌కాలనీలోని 54/4 వార్డు సచివాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ కార్యదర్శి శ్రీహరి మాట్లాడుతూ భగత్‌సింగ్‌కాలనీలోని జనాభా ప్రాతిపదిక పారిశుధ్య సిబ్బంది లేని కారణంగా పారిశుధ్యం లోపిస్తోందన్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగు నిల్వ ఉండి దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. పారిశుధ్య సిబ్బందిని నియమించి డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, అనిల్‌కుమార్, సుబ్బారావు, వంశీ, మదన్, మస్తాన్, మాబాషా, నాని, తదితరులు, పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినియోగదారుడి సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ప్రత్యేక విద్యుత్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక అధ్యక్షులు, విశ్రాంత జడ్జి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. నెల్లూరు టౌన్‌కు సంబంధించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థ నిర్దేశించిన సేవలను వినియోగదారులకు సకాలంలో అందించి న్యాయం చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. నిర్దేశిత సేవల్లో భాగంగా విద్యుత్ వైర్లు(కండక్టర్లు), ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజీ, మీటర్లలోని లోపాలు, కేటగిరిల్లో మార్పులు, విద్యుత్ బిల్లుల్లోని లోపాలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. నెల్లూరు టౌన్‌కు సంబంధించి ఐదు ఫిర్యాదులు అందగా, అందులో ఒక ఫిర్యాదును అప్పటికప్పుడే పరిష్కరించినట్లు ఈఈ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. మిగిలిన హరనాథపురానికి చెందిన శ్రీనివాసరావు విద్యుత్ బిల్లింగ్, బీవీనగర్‌కు చెందిన వైవీఎస్ శర్మ విద్యుత్ కండెక్టర్ ఎత్తు తక్కువగా ఉందని, శైలజ, పెంచలయ్య వ్యవసాయ విద్యుత్ సర్వీసులపై అందజేసిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు ఈశ్వరమ్మ, నెల్లూరు డిప్యూటీ ఈఈలు శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, పలువురు ఏఈలు, తదితరులు, పాల్గొన్నారు.

‘భారతీయుడు–2’ విజయవంతాన్ని కాంక్షిస్తూ..



నెల్లూరు సిటీ: ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో హీరో కమల్‌హాసన్ నటించిన భారతీయుడు–2 చిత్రం విజయవంతాన్ని కాంక్షిస్తూ కమల్‌హాసన్ అభిమానులు సోమవారం సంబరాలు నిర్వహించారు. నగరంలోని సిరి మల్టీప్లెక్స్‌లో భారతీయుడు–2 చిత్ర పంపిణీదారులు సురేష్ ఫిలిమ్స్ ఆధ్వర్యంలో కమల్‌హాసన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కమల్‌హాసన్ అభిమాన సంఘ నాయకుడు మైనుద్దీన్ మాట్లాడుతూ గతంలో భారతీయుడు చిత్రం అఖండ విజయం సాధించిందన్నారు. ఈ నెల 12న విడుదలవుతున్న భారతీయుడు–2 చిత్రం కూడా అదేవిధంగా ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సురేష్ ప్రొడక్షన్ మేనేజర్ ఆర్ నాగేంద్ర, అభిమాన సంఘ నాయకులు వాయుగుండ్ల ప్రసాద్, ఎస్కే రబ్బానీ, యూసఫ్, అజీజ్, సమీర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు(అర్బన్): నగరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)లో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన కొన్ని విభాగాల్లో అందిస్తున్న సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. సోమవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. జీజీహెచ్‌సీలోని యూరాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జన్, అంకాలజీ(కేన్సర్) విభాగాల్లో ఎక్కువ ఖరీదుతో కూడుకున్న వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఆయా విభాగాల్లో అత్యంత అనుభవంతో కూడిన నైపుణ్యం కలిగిన వైద్యులు ఉన్నారని చెప్పారు. పూర్తిస్థాయిలో నర్సింగ్, పారామెడికల్ స్టాఫ్ కూడా ఉన్నారని తెలిపారు. న్యూరాలజీ విభాగానికి ఎక్కువ మంది రోగులు వస్తున్నారని చెప్పా. అంకాలజీ విభాగంలో కూడా రోగుల సంఖ్య పెరిగిందన్నారు. యూరాలజీ, న్యూరో సర్జన్‌ల విభాగాల్లో కూడా ఇప్పుడిప్పుడే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక నష్టపోకుండా జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్యసేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేనేత,హస్త కళలను ఆదరించండి



నెల్లూరు(బృందావనం): చేనేత, హస్త కళలను ప్రతిఒక్కరూ ఆదరించాలని కళా సంస్కృతి చేనేత, హస్తకళా సంస్థ నిర్వాహకుడు లక్ష్మణ్ కోరారు. నగరంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో కళా సంస్కృతి చేనేత, హస్తకళా సంస్థ ఆధ్వర్యంలో చేనేత, హస్త కళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలైన చేనేత, హస్తకళలను సంరక్షించేందుకు, కళాకారులకు తోడ్పాటు అందించేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నెల్లూరులోనూ ప్రదర్శన ఏర్పాటు చేశామని చెప్పారు. దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్త కళాకారులు చీరలు, ఖాదీవస్త్రాలు, బెడ్‌షీట్స్, డ్రెస్‌మెటీరియల్స్, బొమ్మలు, గృహోపకరణాలు, వన్‌గ్రామ్ జ్యూవెలరీ, తినుబండారాలను ప్రదర్శనలో ఉంచారని వివరించారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.

వేగవంతంగా బీసీజీ వ్యాక్సినేషన్

ఇందుకూరుపేట : బీసీజీ వ్యాక్సినేషన్‌ను మరింత వేగవంతం చేయాలని జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి షేక్ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని కొత్తూరు, మైపాడు, రావూరు తదితర గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని, 104 సేవలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి బీసీజీ వ్యాక్సిన్ మేలు చేస్తుందన్నారు. 104 వాహన వైద్యసేవలు, రికార్డులు, మందులు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం కొత్తూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్లు కిషోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు, శ్రావణి, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ పాల్గొన్నారు.